ఇక అంతా 'ఈ-ఫైల్సే'!

సమయం ఆదా చేసేందుకు 'ఈ-ఆఫీస్' ప్రాజెక్ట్ ● జీసీసీలో అక్టోబరు నుంచి అమలు?

పెరంబూర్, ఆగస్టు 26: గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) పరిపాలనలో పారదర్శకత పెంచడంతో పాటు సాధ్యమైనంత త్వరగా ప్రజా సమస్యలకు పరిష్కారం చూపాలని నిర్ణయించింది. ఇందుకోసం లేఖలు, పేపర్ల వాడకం తగ్గించి, 'ఈ-ఆఫీస్' పేరుతో ఎలక్ట్రానిక్ ఆఫీస్ ప్రాజెక్ట్ ప్రారంభించనుంది. జీసీసీ 174 చ.కి.మీ విస్తీర్ణంలో 155 వార్డులతో 10 మండలాలుగా పనిచేస్తున్న విషయం తెలిసిందే. అనంతరం శివారు ప్రాంతాల్లోని 9 నగర పంచాయతీలు, 8 మున్సిపాలిటీలు, 25 పంచాయతీలను 2011వ సంవత్సరంలో జీసీసీలో విలీనం చేయడంతో, జీసీసీ పరిధి 424 చ.కి.మీ విస్తరించింది. ఆ ప్రకారం, 200 వార్డులు, 15 మండలాలతో ప్రస్తుతం జీసీసీ పనిచేస్తోంది.



ఈ-ఆఫీస్...

ఇలాంటి పొరపాట్లు జరగకుండా కార్పొరేషన్ పరిపాలనను 'ఈ-ఆఫీస్' పేరుతో ఎలక్ట్రానిక్ కార్యాలయంగా మార్చి కాగితపు వినియోగం తగ్గించి సత్వర సేవలు అందించాలని నిర్ణయించారు. ప్రస్తుతం అందుకు సంబంధించిన పనులు జరుగుతున్నాయని, అక్టోబరులో ఈ-ఆఫీస్ పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తుందని అధికారులు తెలిపారు. ఈ విషయమై కార్పొరేషన్ అధికారులు మాట్లాడుతూ... భవనాల అనుమతులు, టాక్స్ అసెస్‌మెంట్, ప్రజల ఫిర్యాదులు వంటి సేవలు ఆన్‌లైన్ ద్వారా జరుగుతున్నాయన్నారు. ఇక నుంచి అధికారుల పనులు కూడా ఆన్‌లైన్‌లోనే జరుగనున్నాయని తెలిపారు. వార్డు నుంచి కమిషనర్, మేయర్ వరకు అన్ని ఫైళ్లు ఇకపై ఈ-ఆఫీస్ ద్వారానే జరగనున్నాయన్నారు. తద్వారా నేరుగా శాఖ కార్యాలయానికి ఫైళ్లు తీసుకెళ్లడం, ఆమోదం కోసం ఎదురుచూడడం, ఫైళ్ల పెండింగ్ తదితర సమస్యలకు చెక్ పెట్టవచ్చని అన్నారు. ప్రస్తుతం 15 రోజులు పట్టే ఫైళ్లు కూడా, ఒకేరోజులో అనుమతులు పొందే అవకాశముందని తెలిపారు. దీంతో, సమయం వృథా, కాగితపు వినియోగం తగ్గించడం, ఉద్యోగులకు పనిభారం తగ్గుతుందని అధికారులు తెలిపారు.

అవినీతికి చెక్...

లేఖ ద్వారా ఫైళ్లు ఆమోదానికి పంపుతుండగా, కొందరు ఉన్నతాధికారులు అన్ని పత్రాలు పరిశీలించి సంతకం చేయడం లేదు. కింది ఉద్యోగస్తులపై నమ్మకంతో ఆమోదిస్తున్నారు. అధిక ఫైళ్లు ఉన్న సమయంలో ఇలాంటివి సర్వ సాధారణంగా జరుగుతున్నాయి. అందువల్ల, కొన్ని పత్రాలు లేకుండానే అంగీకారం పొందడం, పత్రాలు మిస్సింగ్ కావడం, ఆమోదానికి తీవ్ర జాప్యం జరిగే అవకాశముంది. ఈ-ఆఫీస్ ద్వారా పంపేటప్పుడు, అన్ని పత్రాలు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఫైళ్లు పరిశీలించిన సమయంలో అన్ని పత్రాలు తప్పక పరిశీలించాల్సి ఉంటుంది. తద్వారా అక్రమాలకు చెక్ పెట్టడంతో పాటు నిర్ణీత వ్యవధిలోనే ప్రాజెక్టులకు అనుమతులు, నిధుల అందజేత, ప్రాజెక్ట్ జరుగుతున్న తీరు తదితరాలు ఎప్పటికప్పుడు తెలుసుకునే అవకాశముంటుంది.

ప్రాజెక్టుల ఆమోదం...

రోడ్లు, కాలువలు, పార్కులు, మరుగుదొడ్ల వసతి తదితర రూ.10 లక్షల్లోపు ఉన్న పనులను మండల సమావేశంలో తీర్మానం చేసుకోవచ్చు. సమావేశంలో తీర్మానం అనంతరం మండల అధికారి అంగీకారంతో పనులు ప్రారంభించవచ్చు. రూ.10 లక్షల నుంచి రూ.50 లక్షల వ్యయంతో కూడిన పనులకు మండల సమావేశంలో తీర్మానం చేసి, జిల్లా డిప్యూటీ కమిషనర్ ఆమోదానికి పంపాల్సి ఉంటుంది. అంతకు మించిన మొత్తానికి డిప్యూటీ కమిషనర్, కమిషనర్, మేయర్ అంగీకారం అవసరం, అలాగే, స్టాండింగ్ కమిటీ ఆమోదించిన ప్రాజెక్టులను కూడా సంబంధిత శాఖ ఆమోదించాల్సి ఉంది.

కాగితపు ఫైళ్లు...

ఒక్కో ప్రాజెక్ట్ స్వభావం, అంచనా వేసి వార్డు జూనియర్ ఇంజనీర్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, జోనల్ ఆఫీసర్, కార్పొరేషన్ సూపరింటెండింగ్ ఇంజనీర్, చీఫ్ ఇంజనీర్ అండ్ ఎడ్యుకేషన్, హెల్త్, ఎంపీ, ఎమ్మెల్యే, అప్రోప్రియేషన్ డిపార్ట్‌మెంట్ అధికారులు సమీక్షకు వెళ్తుంటాయి. వారి అనుమతులు పొంది, టెండర్లు విడుదల చేసి, పనులకు నిర్ణీత గడువు విధించి, పనులు పూర్తయిన తర్వాత వాటి వివరాలు, నాణ్యత తదితరాలను సంబంధిత శాఖల అధికారులకు సమాచారం అందించాలి. ఈ ఫైళ్లన్నీ జూనియర్ ఇంజనీర్ నుంచి కమిషనర్, మేయర్ వరకు లేఖల ద్వారా వెళుతుంటాయి. వీటిని కాగితంపై ముద్రించి ఫైల్‌గా రూపొందించి సంబంధిత విభాగాలకు పంపుతారు.

సమయాభావం...

వాటిలో రూ.10 లక్షల ప్రాజెక్ట్ నివేదిక, లేఖ తయారీ, మొదటిస్థాయి ఆమోదం, తదుపరి ఉన్నతాధికారుల ఆమోదం తదితరాలకు 3 నుంచి 7 రోజులు పడుతుంది. అలాగే, రూ.50 లక్షల వరకు ఉన్న ప్రాజెక్ట్‌లు జిల్లా డిప్యూటీ కమిషనర్‌కు ఫైల్ చేరేందుకు 3 నుంచి 10 రోజుల సమయం పడుతోంది. ఇక, చీఫ్ ఇంజనీర్, కమిషనర్, మేయర్ వద్దకు ఈ ఫైళ్లను తీసుకెళ్లి వారికి వివరించి, వారు అర్థం చేసుకుని ఆమోదించడానికి 15 రోజులు పడుతుంది. కొన్ని ఫైళ్లు నెలల తరబడి ఉన్నతాధికారుల బల్లలపైనే ఉంటున్నాయి. దీంతో, సమయం వృథా కావడం, ప్రాజెక్ట్ ప్రణాళికా వ్యయం పెరగడం, ప్రాజెక్ట్ ప్రజలకు చేరడంలో జాప్యం సహా పలు సమస్యలు తలెత్తుతున్నాయి. కిందిస్థాయి అధికారులు, కౌన్సిలర్లు తమకు నచ్చని ప్రాజెక్టులను కమిషనర్, మేయర్ దృష్టికి తీసుకెళ్లకుండా పక్కన పెడుతున్న ఘటనలు కూడా ఉన్నాయి.

మావి సరదా మాటలే.. స్పర్ధల్లేవు!



దురైమురుగన్, రజనీ

- ● వివరణ ఇచ్చిన మంత్రి దురైమురుగన్
- ● రజనీకాంత్ జోక్యంతో సమసిన వివాదం

చెన్నై, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): సూపర్‌స్టార్ రజనీకాంత్ చేసిన వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించిన రాష్ట్ర సీనియర్ మంత్రి దురైమురుగన్ ఎట్టకేలకు శాంతించారు. తమ ఇద్దరి వ్యాఖ్యలు సరదావని, వాటిని శత్రుత్వంగా మార్చవద్దంటూ సోమవారం వివాదానికి తెరదించే ప్రయత్నం చేశారు. గత శనివారం కలైవానర్ అరంగంలో మంత్రి ఈవీ వేలు మాజీ ముఖ్యమంత్రి కరుణానిధితో తనకున్న సన్నిహిత సంబంధాలను తెలిపేలా రచించిన 'కలైంజర్ ఎనుమ్ తాయ్' అనే పుస్తకావిష్కరణ సభలో పాల్గొన్న రజనీ ప్రసంగిస్తూ.. సీనియర్ మంత్రులు మాజీ విద్యార్థుల వంటివారిని, వారితో వేగడం హెడ్మాస్టర్ లాంటి ముఖ్యమంత్రి స్టాలిన్‌కు కష్టసాధ్యమని సరదాగా వ్యాఖ్యానించారు. మరీ ముఖ్యంగా దురైమురుగన్ లాంటి సీనియర్లను పట్టుకోవడం చాలా కష్టమన్నారు. మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి వద్ద యేళ్ల తరబడిన పనిచేసిన సీనియర్ మంత్రులతోనే స్టాలిన్ ప్రస్తుతం రాష్ట్రాన్ని పరిపాలించడం హర్షణీయమన్నారు. ఈవ్యాఖ్యలపై వేలూరులో ఆదివారం ఓ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి దురైమురుగన్ స్పందిస్తూ..పళ్లూడిపోయిన, గడ్డాలు పెరిగిన సీనియర్ హీరోలు ఇంకా నటిస్తుండటం వల్ల యువకులకు సినిమా అవకాశాలు దూరమవుతున్నాయని కటువుగా వ్యాఖ్యానించారు. మంత్రి చేసిన ఈ వ్యాఖ్యలు కోలీవుడ్‌లో తీవ్ర దుమారం రేపాయి. రజనీ-దురైమురుగన్ మధ్య వివాదం నెలకొన్నట్లేనని, ఇది ఎటు నుంచి ఎటువైపు వెళ్తుందోనన్న చర్చ కూడా మొదలైంది. ఈ పరిస్థితుల్లో సోమవారం ఉదయం రజనీకాంత్ ఓ సినిమా షూటింగ్ కోసం ఏపీకి వెళతూ విమానాశ్రయం వద్ద మీడియాతో మాట్లాడారు. మంత్రి దురైమురుగన్ వ్యాఖ్యల పట్ల స్పందిస్తూ.. మంత్రి దురైమురుగన్ తన చిరకాల మిత్రుడని, ఆయనంటే తనకు చాలా ఇష్టమని, ఆయన తనపై ఎలాంటి విమర్శలు చేసినా బాధపడనని పేర్కొన్నారు. తమ ఇద్దరి మధ్య స్నేహం చెక్కుచెదరదని పేర్కొన్నారు. ఆ తర్వాత వేలూరులో వీఐటీ విశ్వవిద్యాలయంలో మాజీముఖ్యమంత్రి కరుణానిధి శతజయంతి వేడుకల్లో పాల్గొన్న మంత్రి దురైమురుగన్ వద్ద విలేరరులు రజనీ స్పందన గురించి ప్రస్తావించినప్పుడు తమ సరదా వ్యాఖ్యలను ఎవరూ తీవ్రంగా భావించరాదని, తామిరువురుమూ ఎప్పటిలానే మంచి మిత్రులుగానే కొనసాగుతామని చెప్పారు.

నకిలీ అధ్యాపకుల వ్యవహారం

అన్నావర్సిటీ కన్నెర్ర



900 మంది అధ్యాపకులపై జీవితకాల నిషేధం

ప్యారీస్, ఆగస్టు 26: నకిలీ అధ్యాపకుల వ్యవహారంపై అన్నా యూనివర్సిటీ కన్నెర్ర చేసింది. 900 మంది అధ్యాపకులు ఇంజనీరింగ్ కళాశాలల్లో పని చేయకుండా జీవితకాల నిషేధం విధించింది. మరో 295 ప్రైవేటు కళాశాలలపై కూడా చర్యలు చేపట్టింది. అన్నా యూనివర్సిటీ నిర్వహణలో ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలు, అనుబంధ కళాశాలలున్నాయి. వీటిలో నిబంధనలు అతిక్రమించడం, కనీస వసతులు కల్పించకపోవడం, విద్యార్థుల సంఖ్యకు తగ్గ ప్రొఫెసర్లు, సిబ్బందిని నియమించకపోవడం, ముఖ్యంగా నకిలీ ప్రొఫెసర్లను నియమించడం వంటి తప్పిదాలు విచారణలో వెలుగు చూశాయి. వివాదాస్పదమైన ఈ ఆరోపణలపై సమగ్ర విచారణకు రాష్ట్రప్రభుత్వం ముగ్గురు నిపుణులతో కూడిన కమిటీని నియమించింది. ఈ కమిటీ విచారణ నివేదికను అన్నా వర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ వద్ద సమర్పించాల్సిందిగా గవర్నర్ ఆర్ఎన్ రవి ఉత్తర్వులు జారీచేశారు. ఈ నేపథ్యంలో, తాజాగా అన్నా వర్సిటీలో జరిగిన సిండికేట్ సమావేశంలో నిపుణుల కమిటీ నివేదిక పరిశీలించి, 900 మంది నకిలీ ప్రొఫెసర్లపై శాశ్వత నిషేధంతో పాటు మరో 295 ప్రైవేటు కళాశాలలపై క్రిమినల్ చర్యలు చేపట్టాల్సిందిగా ఉత్తర్వులు జారీ అయ్యాయి. వీరంతా వివిధ రకాల ఐడీ కార్డుల ఆధారంగా ఏక కాలంలో వివిధ కళాశాలల్లో ఉద్యోగాలు చేసి, జీతాలు తీసుకున్నట్లు తేలింది.

మద్రాసు వర్సిటీలో

350 పోస్టుల ఖాళీ

పదేళ్లుగా ఇదే తంతు!

ప్యారీస్, ఆగస్టు 26: మద్రాసు వర్సిటీలో 350 పోస్టులు ఖాళీగా వున్నాయి. పదేళ్లుగా ఈ పోస్టులు ఖాళీగా వున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. ఆ పోస్టుల పని ఇతర సిబ్బందిపై భారం పడుతుండడంతో వారు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఇకనైనా ఆ పోస్టులను భర్తీ చేయాల్సిందిగా ప్రొఫెసర్లు రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. దేశంలో పురాతనమైన, ప్రసిద్ధిచెందిన వర్సిటీల్లో ఒకటైన ఈ ఉన్నత విద్యాసంస్థలో పర్మినెంట్‌గా పనిచేస్తున్న ప్రొఫెసర్ల సంఖ్య ఈ పదేళ్లలో గణనీయంగా తగ్గింది. మొత్తం 536 పోస్టుల్లో పదేళ్ల క్రితం 350 పోస్టులు ఖాళీ అయ్యాయి. ఇందుకు కారణం నిధుల కొరత అని ప్రొఫెసర్లు వాపోతున్నారు. మరోవైపు ఈ వర్సిటీకి ఏడాదికి పైగా వైస్‌ఛాన్స్‌లర్‌ను నియమించలేదు. రెండేసి శాఖలకు కలిపి ఒక్క ప్రొఫెసర్ కూడా లేని పరిస్థితి నెలకొంది. విద్యార్థులకు తరగతులు నడిపేందుకు తాత్కాలిక ప్రొఫెసర్లను నియమించారు. యేటా దాదాపు 5 నుంచి ఆరుగురు సీనియర్ ప్రొఫెసర్లు పదవీవిరమణ చేస్తున్నారు. గత 11 ఏళ్లుగా ఈ వర్సిటీకి కొత్తగా ఉద్యోగులను నియమించలేదు. నూతన పరిశోధనలకు పేరుగాంచిన మద్రాసు వర్సిటీలో ప్రస్తుతం పరిశోధన విభాగంలో చదువుకుంటున్న విద్యార్థులకు తమకు పాఠాలు నేర్పించే అధ్యాపకులు లేక ఇబ్బందుల పాలవుతున్నారని, ఇక్కడ 140 మంది ప్రత్యేక రీడర్లు ఉన్నప్పటికీ, నాణ్యమైన విద్య కరువైందని ఉద్యోగులు వాపోతున్నారు. దీనిపై మాజీ వైస్ ఛాన్స్‌లర్ జి.తిరువాసగం మాట్లాడుతూ.. పదేళ్లుగా ఖాళీగా ఉన్న 350 పోస్టులు భర్తీచేయాలంటూ పలుమార్లు ప్రభుత్వానికి రాతపూర్వకంగా విన్నవించుకున్నా ఒక్కరు కూడా స్పందించలేదని తెలిపారు. యూజీసీ కమిటీ ఇటీవల ఈ వర్సిటీకి ప్లస్ వన్ గ్రేడ్‌గా గుర్తించిందని, కొత్త కోర్సులు ప్రారంభించేందుకు పూర్తి స్వాతంత్ర్యం కల్పించిందని, ఈ ఘనత దక్కించుకొనేందుకు అవసరమైన చర్యలను ప్రభుత్వం ఇప్పటికైనా చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.





కొత్త పథకాలకు శంకుస్థాపన చేస్తున్న సీఎం స్టాలిన్

ఉత్తర చెన్నైలో రూ.115.58 కోట్లతో

6 కొత్త పథకాలు

సీఎం స్టాలిన్ శంకుస్థాపన

చెన్నై, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఉత్తర చెన్నై అభివృద్ధి పథకం విస్తరణలో భాగంగా చెన్నై మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సీఎండీఏ) ఆధ్వర్యంలో రూ.115.58 కోట్లతో చేపట్టనున్న 6 కొత్త పథకాలకు సీఎం స్టాలిన్ శంకుస్థాపన చేశారు. విల్లివాక్కం శివశక్తి కాలనీలో సోమవారం ఉదయం ఏర్పాటైన కార్యక్రమంలో కొళత్తూరులో రంగు చేపల అక్వేరియంతో ట్రేడ్ సెంటర్, సామాజిక సంక్షేమ కేంద్రం, లాండ్రీ సెంటర్, పుళల్, రెట్టేరి, కొళత్తూరు చెరువుల మరమ్మతులు వంటి 6 పథకాలను సీఎండీఏ చేపట్టనుంది. ఇదే విధంగా రూ.5.22కోట్లతో ఆహారవస్తువుల సరఫరా వినియోగదారుల భద్రతా శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన కొళత్తూరు మండల సహాయ కమిషనర్ కార్యాలయం, కొళత్తూరు తహసీల్దార్ కార్యాలయం, అయనావరంలో నిర్మించిన లాండ్రీ రూం, మూడు రేషన్‌షాపులను సీఎం ప్రారంభించారు. నగరంలోని అన్ని ప్రాంతాల్లో సమానంగా అభివృద్ధి పనులు అమలు చేయాలన్న ప్రభుత్వ లక్ష్యం ప్రకారం మూడేళ్లలో రూ.1000 కోట్లతో ఉత్తర చెన్నై అభివృద్ధి పథకాన్ని రూపొందించారు. ఈ పథకం ద్వారా ఏయే ప్రాంతాల్లో ప్రజలకు మౌలిక సదుపాయాలు అందుబాటులో లేవో ఆ ప్రాంతాల్లో అవసరమైన అభివృద్ధి పనులను అమలు చేయనున్నారు. ఆ మేరకు విల్లివాక్కం పాడి ఫ్లైఓవర్ దిగువ శివశక్తి కాలనీలో సుమారు 3.93 ఎకరాల్లో రూ.53.50 కోట్లతో 1,25,402 చదరపుటడుగుల విస్తీర్ణంలో దిగువ అంతస్తులో 64 దుకాణాలు, కార్యాలయ గది, ద్విచక్ర వాహనాలు, నాలుగు చక్రాల వాహనాల పార్కింగ్ ప్రాంతం, మొదటి అంతస్తులో 70 దుకాణాలు, రెండో అంతస్తులో రెస్టారెంట్‌తో కూడిన 54 దుకాణాలు, ముందు భాగాన రంగుచేపల అక్వేరియంతో కూడిన వాణిజ్య సముదాయం (బిజినెస్ మాల్) నిర్మించనున్నారు. ఇదే విధంగా రాయపురం మూలకొత్తలంలో 0.67 ఎకరాల్లో రూ.14.31 కోట్లతో 41,593 చదురపుటడుగుల విస్తీర్ణంలో దిగువదళంతో రెండు అంతస్తులో సామాజిక సంక్షేమ కేంద్రాన్ని నిర్మిస్తారు. పురుషవాక్కం కార్న్ స్మిత్ రోడ్డులో 1.04 ఎకరా విస్తీర్ణంలో రూ.11.43 కోట్ల తో 45,198 చదురపుటడుగుల విస్తీర్ణంలో దిగువ దళంలో లాండ్రీ కేంద్రాలు, మెషిన్ సెంటర్‌లు, వాషింగ్ సెంటర్‌లు, ఆరవేసే యంత్రాలు, ఇస్త్రీ సెంటర్, ద్విచక్రవాహనాలు, నాలుగు చక్రాల వాహనాలకు పార్కింగ్ స్థలంతోపాటు 60 గదులతో కూడిన నవీన లాండ్రీ సెంటర్‌ను నిర్మించనున్నారు.

మూడు చెరువులకు మహర్దశ..

ఉత్తర చెన్నై అభివృద్ధిపనుల విస్తరణలో భాగంగా పుళల్, రెట్టేరి, కొళత్తూరు చెరువు ప్రాంతాలను నగరవాసుల సందర్శనీయ స్థలాలుగా అభివృద్ధి పరచనున్నారు. ఆ మేరకు పుళల్ చెరువు సమీపంలో 8.17 ఎకరాల విస్తీర్ణంలో రూ.16.96 కోట్ల వ్యయంతో పాదచారుల రహదారి, ప్రకృతి సౌందర్యాలతో కూడిన హైలెవల్ ఫుట్‌పాత్, మియావాకీ వనాలు, చిన్నారులకు ఎగ్జిబిషన్, స్విమ్మింగ్ పూల్, తాగునీటి సదుపాయం, మరుగుదొడ్లతో పిక్నిక్ స్పాట్‌లా అభివృద్ధి చేయనున్నారు. రెట్టేరి చెరువుగట్టు సమీపంలో 4.38 ఎకరాల విస్తీర్ణంలో రూ.13.12 కోట్ల వ్యయంతో ప్రవేశద్వారంతో కూడిన హాలు, వంతెనలు, నేచురల్ గార్డెన్, పార్కులు, జాగింగ్ ప్రాంతాలు, సోలార్ విద్యుత్‌తో పనిచేసే షాడో సెంటర్లు, వ్యాయామశాలలు, చిన్నారుల కోసం క్రీడామైదానం, వాహనాల పార్కింగ్ ప్రాంతం, మరుగుదొడ్లు తదితర సదుపాయాలతో ప్రముఖ సందర్శనీయ ప్రాంతంగా తీర్చిదిద్దనున్నారు. ఇక కొళత్తూరు చెరువుగట్టు సమీపంలో 0.4 ఎకరాల విస్తీర్ణంలో రూ.6.26 కోట్లతో నేచురల్ జాగింగ్ స్పాట్, బోట్ సవారీ, చిన్నారులకు ప్లేస్టేషన్, వాటర్ ఫౌంటైన్లు, మ్యూజిక్ గార్డెన్, మెరిసే చేపల విగ్రహాలతో సందర్శనీయ ప్రాంతంగా అభివృద్ధి పరచనున్నారు. ఈ ఆరు పథకాలకు ముఖ్యమంత్రి స్టాలిన్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కేఎన్ నెహ్రూ, పొన్ముడి, అనితా ఆర్.రాధాకృష్ణన్, పీకే శేఖర్‌బాబు, గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ మేయర్ ఆర్. ప్రియా, ఎంపీలు దయానిధిమారన్ డాక్టర్ కళానిధి వీరాసామి, గిరిరాజన్, శాసన సభ్యులు ఎస్‌సుదర్శనం, తాయగంకవి, వెట్రిఅళగన్, ఆర్‌మూర్తి, జేజే ఎబినేజర్, ఆర్డీ శేఖర్, జోసెఫ్ సామువేల్, డిప్యూటీ మేయర్ ఎం.మహేష్‌కుమార్, రాష్ట్ర గోదాముల సంస్థ ఛైర్మన్ పి.రంగనాథన్, పశుసంవర్ధక పాడిపరిశ్రమలు మత్స్య శాఖల అదనపు ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.గోపాల్, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి పి. అముద, గృహవసతి, నగరశివారు ప్రాంతాల అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి కాకర్ల ఉషా, చెన్నై మహానగర అభివృద్ధి సంస్థ మెంబర్ సెక్రటరీ అన్సుల్ మిశ్రా, గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ కమిషనర్ జె.కుమారగురుబరన్, సీఎండీఏ సీఈఓ ఎ. శివజ్ఞానం, చెన్నై జిల్లా కలెక్టర్ రష్మీ సిద్ధార్థ్ జక్డే తదితరులు పాల్గొన్నారు.

పాడి ఫ్లైఓవర్ దిగువ శివశక్తికాలనీలో నిర్మించనున్న అంతర్జాతీయ వాణిజ్య కేంద్రం నమూనాను పరిశీలిస్తున్న స్టాలిన్



నేనెవరి కాళ్లూ పట్టుకుని

పదవిలోకి రాలేదు

- ● ఈపీఎస్‌కు అన్నామలై సీరియస్ కౌంటర్



చెన్నై, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామిలాగా దోక్కుంటూ వెళ్లి ఎవరి కాళ్లూ పట్టుకుని పదవిలోకి రాలేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై కౌంటర్ ఇచ్చారు. ఆదివారం ఉదయం సేలంలో జరిగిన పార్టీ సమావేశంలో పాల్గొన్న ఈపీఎస్ విలేకరులతో మాట్లాడుతూ... కష్టపడకుండానే అన్నామలై బీజేపీ అధ్యక్ష పదవిని పొందారంటూ విమర్శించారు. దీనిపై చెన్నైలో జరిగిన పార్టీ సమావేశంలో అన్నామలై కౌంటర్ ఇచ్చారు. ఎంజీఆర్, జయలలిత నాయకత్వం వహించిన అన్నాడీఎంకే ప్రస్తుతం లేదని, ఆ పార్టీ టెండర్ల పార్టీగా మారిపోయిందని, ఆ పార్టీకి నాయకత్వం వహిస్తున్న ఈపీఎస్ కూవత్తూరు శిబిరంలో ఎవరి కాళ్లను పట్టుకుని పదవిని పొందారో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసని వ్యాఖ్యానించారు. తాను నిజాయితీ కలిగిన ఐపీఎస్ అధికారిగా సేవలందించిన తర్వాతే బీజేపీలో చేరి పార్టీ అభివృద్ధికి శాయశక్తులా పాడుతున్నానని, అధిష్ఠానం మెప్పు పొందిన మీదటే పదవిలోకి వచ్చానన్నారు. ఈపీఎస్‌లాగా ఎవరి కాళ్లూ పట్టుకోలేదని యెద్దేవా చేశారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే నాలుగో స్థానానికి పతనమవడం ఖాయమన్నారు. పాలకపక్షం డీఎంకేతో బీజేపీ రహస్యంగా పొత్తు కుదుర్చుకుందంటూ ఈపీఎస్ అదేపనిగా విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. డీఎంకే తమ పార్టీ ఎప్పుడూ పొత్తు కుదుర్చుకునే అవకాశమే లేదని, కాంగ్రెస్ పార్టీలా తాము ఆ పార్టీకి బానిసలం కాదని అన్నామలై అన్నారు.

ఇదేమి చోద్యం...

గత యేడాది సనాతన ధర్మ వ్యతిరేక మహానాడులో పాల్గొన్న దేవాదాయ శాఖ మంత్రి శేఖర్‌బాబు, ఈ యేడాది జరిగిన ముత్తమిళ్ మురుగన్ మహానాడుకు అధ్యక్షత వహించడం వింతగా విడ్డూరంగా ఉందని, పదేపదే ద్రావిడ తరహా పాలన అందిస్తున్నామని ప్రకటనలు చేస్తున్న డీఎంకే నాయకులకు కూడా మింగుడు పడని విధంగా ఈ రెండు సంఘటనలు రాష్ట్రంలోనే చోటుచేసుకున్నాయని అన్నామలై విమర్శించారు. నగరంలో ద్రావిడ కళగం జరిపిన సనాతనధర్మం వ్యతిరేక మహానాడు ఫొటోను, పళనిలో జరిగిన ముత్తమిళ్ మురుగన్ మహానాడు ఫొటోను జతకలిపి తన ఎక్స్‌పేజీలో ఆయన వెలువరించారు. ఆధ్యాత్మిక భావాలకు వ్యతిరేకంగా సాగుతున్న తమ పాలనపై ప్రజాగ్రహం అధికమైందన్న భయంతోనే ఉన్నట్టుండి మురుగన్ మహానాడును నిర్వహించారని ఆరోపించారు. అయితే సనాతన ధర్మం వ్యతిరేక మహానాడు జరిపినవారే తనకోసం మహానాడు నిర్వహించారనే విషయాన్ని తమిళుల ఆరాధ్యదైవం మురుగప్పెరుమాన్ నిశితంగా పరిశీలిస్తున్నారనే విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని అన్నామలై చెప్పారు.

అన్నామలై నోటికి కళ్లెం వేయకుంటే ఓటమే

- ● సెల్వ పెరుందగై

చెన్నై, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ నేతలంతా డీఎంకేకు బానిసలుగా ఉంటున్నారంటూ బీజేపీ అధ్యక్షుడు అన్నామలై చేసిన విమర్శలను టీఎన్‌సీసీ నేత సెల్వపెరుందగై తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన జారీ చేస్తూ.. ఆధారాలు లేని ఆరోపణలు, విమర్శలు చేయడం అన్నామలైకి అలవాటుగా మారిందని, అన్నాడీఎంకే ఈపీఎస్‌ను తిడుతూ మధ్యలో కాంగ్రెస్ పార్టీని రచ్చకీడ్చడం తగదని అన్నారు. రాష్ట్రంలో బీజేపీ వరుసగా ఓటు బ్యాంక్ తీవ్రంగా పడిపోతున్నదని, అలాంటప్పుడు పార్టీని అభివృద్ధిపై దృష్టి సారించకుండా కాంగ్రెస్ నేతలను బానిసలుగా విమర్శించడం మానుకోవాలని, నోటికి కళ్లెం వేయకపోతే మళ్లీ బీజేపీని ఓడించి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. ఇదిలా ఉండగా అన్నాడీఎంకే మాజీ మంత్రి ఆర్బీ ఉదయకుమార్ ఓ ప్రకటన జారీ చేస్తూ... అన్నామలైకి ఇటీవల మతి భ్రమించిందని, రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా, పాలకపక్షంగా వ్యవహరించిన తమ పార్టీ నేత గురించి తీవ్ర విమర్శలు చేయడం మానుకోవాలని హితవు పలికారు.

సమాచార దృశ్యిని

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఐసిఎఫ్, ఆగస్టు 26: విద్యుత్ మార్గాల్లో చేపట్టనున్న మరమ్మతుల కారణంగా అంబత్తూర్, రెడ్‌హిల్స్, చెంబరంబాక్కం ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

అంబత్తూర్: జీసన్ కాలనీ, గ్యాలెక్సీ రోడ్డు, పొన్నియమ్మన్ నగర్, వానగరం రోడ్డు, రాజన్‌కుప్పం, ఈజీఎన్ మహాలక్ష్మి నగర్, ఎస్సీ రెసిడెన్సీ, మెట్రో సిటీ, వెల్లాలర్ వీధి, స్కూల్ రోడ్డు, పీకేఎం వీధి, ఇరుళర్ కాలనీ, ఎత్తీశ్వరన్ ఆలయ వీధి, చెట్టి మెయిన్ రోడ్డు

రెడ్‌హిల్స్: పాడియనల్లూర్, జ్యోతి నగర్, కర్పర నగర్, మరుదుపాండి నగర్, మహాలక్ష్మి నగర్

చెంబరంబాక్కం: నజరత్‌పేట, మేంబూరు, వరదరాజపురం, బెంగళూరు హైరోడ్డు, చెంబరంబాక్కం ఏరియా, తిరుమిళిసై, మలయంబాక్కం, ఆగరమేల్

7నుంచి నాటకోత్సవాలు

ఐసిఎఫ్, ఆగస్టు 26: స్థానిక టి.నగర్‌లో భారత్ కళాచార్ సంఘం ఆధ్వర్యంలో సెప్టెంబరు 7వ తేది నుంచి 9 రోజులు నాటకోత్సవాలు జరగనున్నాయి. ఈ సంఘం యేటా వివిధ కళలు, సంగీతోత్సవాలు నిర్వహించి ఉత్తమ కళాకారులకు పురస్కారాలు అందజేస్తోంది. నాటకోత్సవాల పేరుతో ప్రతి సంవత్సరం గుర్తింపు పొందిన కళాకారులు పాల్గొనే నాటకాలను నిర్వహించి అభిమానులు, కళాకారులను ప్రోత్సహిస్తోంది. ఈ ఏడాదికిగాను నాటకోత్సవాలు టి.నగర్ తిరుమలైపిళ్లై వీధిలో ఉన్న వైజీపీ ఆడిటోరియంలో జరగనున్నాయి. వారాంతపు సెలవు రోజుల్లో సాయంత్రం 6.45 గంటల నుంచి నాటకాలు జరగనున్నాయి. 7, 8, 9, 14, 15, 21, 22, 28, 29 తేదీల్లో మహాన్ శ్రీ నారాయణ గురు, బిగ్‌బాస్, కురుక్షేత్రం, టీచర్స్ డే వంటి నాటకాలు ప్రదర్శించనున్నారు.

58 జెట్ రాడింగ్ వాహనాల కొనుగోలు

ఐసిఎఫ్, ఆగస్టు 26: మురుగునీరు తొలగించేందుకు చెన్నై కార్పొరేషన్ జెట్ రాడింగ్ వాహనాలు కొనుగోలు చేసింది. కార్పొరేషన్ పరిధిలో 4,659 కి.మీ పొడవున మురుగునీటి పైప్‌లైన్ కనెక్షన్లు, 1.60 లక్షల మ్యాన్ హోల్స్ ఉన్నాయి. వీటిలో పూడికతీతకు 399 యంత్రాలు, 142 వాహనాలు, 35 మురుగునీరు తొలగించే వాహనాలు, 63 అతివేగంగా మురుగునీరు తొలగించే వాహనాలున్నాయి. కొన్ని మండలాల్లో వాహనాల కొరత ఉండడంతో రూ.28.56 కోట్లతో 58 జెట్ రాడింగ్ వాహనాలు కార్పొరేషన్ కొనుగోలు చేసింది.

ఒలంపిక్ క్రీడాకారులకు నజరానా

పెరంబూర్, ఆగస్టు 26: ప్యారీస్‌లో జరిగిన ఒలంపిక్ పోటీల్లో రాష్ట్రానికి చెందిన ఆరుగురు అథ్లెటిక్ క్రీడాకారులు పాల్గొన్నారు. రాష్ట్రం తరపున పాల్గొన్న వారిని అభినందిస్తూ తలా రూ.లక్ష నజరానాను రాష్ట్రప్రభుత్వం ప్రకటించింది. స్థానిక పెరియమేడులోని నెహ్రూ స్టేడియంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో తమిళనాడు అథ్లెటిక్ సంఘం తరపున ఈ నజరానాను ఒలంపిక్ క్రీడాకారులకు అందజేశారు.

రూ.90.50 కోట్లతో మహాబలిపురంలో బస్ టెర్మినల్

ఐసిఎఫ్, ఆగస్టు 26: మహాబలిపురంలో రూ.90.50 కోట్లతో బస్ టెర్మినల్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. యునెస్కో గుర్తింపు పొందిన పర్యాటక స్థలంగా ఉన్న మహాబలిపురాన్ని ప్రతిరోజు రాష్ట్రంలోని వివిధ జిల్లాలు, పొరుగు రాష్ట్రాలు, విదేశీ పర్యాటకులు సందర్శిస్తున్నారు. ప్రస్తుతం స్థలశయన పెరుమాళ్ ఆలయ ప్రవేశద్వారం సమీపంలో చిన్న స్థలంలో 50 ఏళ్లుగా షెల్టర్ లేని బస్టాండ్ ఉంది. 30కి పైగా ప్రభుత్వ, సిటీ, ప్రైవేటు బస్సులు ఇక్కడికి వచ్చి వెళుతుంటాయి. ఒకేసారి 10 బస్సులకు పైగా వస్తుండడంతో వాటిని నిలిపేందుకు స్థలం లేకపోవడంతో రహదారిపై నిలపాల్సి వస్తుండడంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. ఈ సమస్య పరిష్కరించేలా ఆధునిక సౌకర్యాలతో రూ.90.50 కోట్లతో 6.79 ఎకరాల్లో కొత్త బస్టాండ్ నిర్మాణపనులు జరుగుతున్నాయి.

పులుల అభయారణ్యంలో బస చేసిన 12 మందికి జరిమానా

ఐసిఎఫ్, ఆగస్టు 26: పులుల అభయారణ్యంలో బస చేసిన 12 మందికి అటవీ శాఖ అధికారులు జరిమానా విధించారు. తిరుప్పూర్ జిల్లా ఆనమలై పులుల అభయారణ్య పరిధికి చెందిన ఉడుమలై, కాట్టుపట్టి, మావడైప్పు వంటి ప్రాంతాల్లో అటవీ శాఖ సిబ్బంది గస్తీ చేపట్టారు. అక్కడున్న గిరిజన గ్రామానికి చెందిన కుమార్ అనే వ్యక్తి ఇంట్లో అనుమతి లేకుండా బసచేసిన వ్యక్తులను గుర్తించి విచారణ జరిపారు. వారిలో నలుగురు చెన్నైకి చెందిన వారు కాగా, ముగ్గురు శరణార్థుల శిబిరానికి చెందిన వారు. ఈ ఏడుగురిపై కేసు నమోదు చేసి తలా రూ.20,000 జరిమానా విధించారు. అలాగే, ఉడుమలై సమీపంలో రావణపురానికి చెందిన ఐదుగురు పశువులు కొనుగోలు చేసేందుకు అనుమతి లేకుండా గిరిజనుల గ్రామానికి వచ్చారు. వారిపై కేసు నమోదుచేసి తలా రూ.20,000 జరిమానా విధించారు.

బీడి ఆకు బస్తాల స్వాధీనం

ఐసిఎఫ్, ఆగస్టు 26: తూత్తుకుడి నుంచి శ్రీలంకకు తరలించేందుకు సిద్ధంగా ఉంచిన బీడీ ఆకుల బస్తాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తూత్తుకుడి తిరేశ్‌పురం బీచ్ మీదుగా బీడి ఆకులు తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఆదివారం అర్ధరాత్రి సముద్ర తీరంలో గస్తీ చేపడుతుండగా ఆటో వచ్చింది. అందులో 30 కిలోల బరువు కలిగిన 9 బస్తాల్లో బీడి ఆకులు ఉండడాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వాటిని తరలించేందుకు యత్నించిన తిరేశ్‌పురానికి చెందిన ఆరోగ్య జాన్సన్‌ను అరెస్ట్ చేశారు. పోలీసులను గమనించి పారిపోయిన మరికొందరి కోసం గాలిస్తున్నారు.

నేడు కోర్టుకు హాజరుకానున్న ఈపీఎస్

పెరంబూర్, ఆగస్టు 26: డీఎంకే ఎంపీ దయానిధి మారన్ దాఖలు చేసిన పరువు నష్టం కేసులో ఎడప్పాడి పళనిస్వామి మంగళవారం కోర్టుకు హాజరుకానున్నారు. ఎంపీ, ఎమ్మెల్యేలపై ఉన్న కేసులు విచారిస్తున్న కోర్టులో ఈపీఎస్ హాజరుకానున్నారని అన్నాడీఎంకే అధిష్ఠానం తెలిపింది. పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో వాస్తవాలకు విరుద్ధంగా ఎడప్పాడి ఆరోపణలు చేశారని ఆరోపణలున్నాయి. అవాస్తవాలు ప్రచారం చేశారంటూ పళనిస్వామికి వ్యతిరేకంగా దయానిధి మారన్ పరువు నష్టం కేసు దాఖలు చేశారు.

చేపల వేట నిషేధకాలంలో రూ.18,300 అందించాలి

పెరంబూర్, ఆగస్టు 26: చేపల వేట నిషేధకాలంలో జీవన భృతిగా రూ.18,300 అందించాలని జాలర్ల కార్మిక సంఘం డిమాండ్ చేసింది. స్థానిక పళవేర్కాడులో సోమవారం సీఐటీయూ అనుబంధమైన తమిళనాడు జాలర్ల కార్మిక సంఘం 6వ మహానాడు జరిగింది. శ్రీలంక నావికా దళం అరెస్ట్ చేసి ఆ దేశ జైళ్లలో ఉన్న రాష్ట్ర జాలర్లను, వారు స్వాధీనం చేసుకున్న పడవలు విడిపించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సత్వరం చర్యలు చేపట్టాలని మహానాడులో తీర్మానం చేశారు.

నెరవేరిన స్వప్నం

ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు విద్యార్థులకు ఎంబీబీఎస్ సీటు



జీవాలను సంరక్షిస్తున్న నాగరాజ్

పెరంబూర్, ఆగస్టు 26: బస్సు వసతి కూడా లేని ఆ గ్రామంలో, ప్రతిరోజు సైకిళ్లపై పాఠశాలకు వెళ్లి చదువుకుంటున్న ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు విద్యార్థులు మదురై ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ కోర్సులో చేరడంతో ఉపాధ్యాయులు వారిని అభినందిస్తున్నారు. శివగంగ జిల్లా కారైక్కుడి సమీపం కమలై గ్రామానికి చెందిన రైతు పెరియస్వామి కుమారుడు నాగరాజ్ (17). దివ్యాంగుడైన నాగరాజ్ పీర్‌కలైక్కాడు ప్రభుత్వ మోడల్ హయ్యర్ సెకండరీ స్కూలులో ప్లస్‌టూ పూర్తి చేశాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా మేకలు, గొర్రెలను మేత కోసం పొలాల్లోకి తీసుకెళ్తుంటాడు. పాఠశాల సెలవు రోజుల్లో నాగరాజ్ తండ్రికి సాయంగా వెళ్తుంటాడు. ప్లస్‌టూ పబ్లిక్ పరీక్షల్లో 435 మార్కులు సాధించిన నాగరాజ్‌ను పాఠశాల ఉపాధ్యాయులు, జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసిన నీట్ శిక్షణ కేంద్రంలో చేర్పించారు. నీట్‌లో 636 మార్కులు సాధించిన నాగరాజ్, దివ్యాంగుల 3 శాతం కోటాలో మదురై ప్రభుత్వ వైద్యకళాశాలలో సీటు పొందాడు. అలాగే, ఇదే గ్రామానికి చెందిన దినసరి కూలి ఉదయప్పన్ కుమారుడు రవి కూడా నాగరాజ్ చదివిన పీర్‌కలైక్కాడు ప్రభుత్వ మోడల్ హయ్యర్ సెకండరీ స్కూలులో ప్లస్‌టూ పూర్తి చేశాడు. రవిని కూడా ఉపాధ్యాయులు నీట్ కోచింగ్ సెంటర్‌లో చేర్చారు. నీట్‌లో 597 మార్కులు సాధించిన రవి, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కేటాయించిన 7.5 శాతం కోటాలో మదురై ప్రభుత్వ వైద్యకళాశాలలో సీటు పొందాడు. వీరివురిని ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

భక్తులు కాళ్లు తడుపుకునేలా ప్రత్యేక వసతి



భక్తులు కాళ్లు తడుపుకొనేలా ఏర్పాటైన నీటి వసతి

పెరంబూర్, ఆగస్టు 26: తిరువూర్ విశ్వేశ్వరస్వామి ఆలయ రాజగోపురం మెట్ల ముందు చిన్నగా నీటి ధార వెళ్లే వసతి కల్పించారు. భక్తులు ఆలయం లోపలికి వెళ్లే ముందు ఈ నీటి ధారలో కాళ్లు తడుపుకొని వెళ్లవచ్చు. ఇందుకోసం ప్రత్యేకంగా పైప్ లైన్ ఏర్పాటు చేసి డ్రిప్ విధానంలో నీరు పడేలా ఏర్పాటు చేశారు. ఈ విషయమై ఆలయ అధికారులు మాట్లాడుతూ... భక్తులు పెద్దసంఖ్యలో వచ్చే ఆలయాల్లో, వ్యాధుల వ్యాప్తి నిరోధించే చర్యలు చేపడుతున్నారన్నారు. ఇలాంటి వసతి వీరరాఘవపెరుమాళ్ ఆలయంలోనూ ఏర్పాటు చేసినట్లు వారు పేర్కొన్నారు.

భక్తుల బ్యాగులపై రిఫ్లెక్టర్ స్టిక్కర్లు



బ్యాగులపై స్టిక్కర్లు అంటిస్తున్న పోలీసులు

పెరంబూర్, ఆగస్టు 26: రాత్రి వేళల్లో పాదయాత్రగా వెళ్తున్న భక్తుల భద్రత కోసం వారి బ్యాగులపై రిఫ్లెక్టర్ స్టిక్కర్లు అంటించే పనులను పోలీసులు చేపట్టారు. ప్రపంచ ప్రసిద్ధిచెందిన వేలాంకన్ని మేరీ మాత ఆలయ ఉత్సవాలు ఈనెల 29న పతాకావిష్కరణతో ప్రారంభం కానున్నాయి. ఈ వేడుకల ముందే మాలధారణ చేసిన భక్తులు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పాదయాత్రగా వేలాంకన్నికి చేరుకుంటుంటారు. రాత్రి వేళ కూడా భక్తులు పాదయాత్ర చేస్తున్న సమయంలో, వారికి ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చేపట్టే చర్యలు చేపట్టాలని కడలూరు జిల్లా ఎస్పీ రాజారామ్ ఉత్తర్వులు జారీచేశారు. దీంతో, కడలూరు డీఎస్పీ ప్రభు నేతృత్వంలో ట్రాఫిక్ పోలీసులు, ఆదివారం పాదయాత్రగా వేలాంకన్ని వెళ్తున్న భక్తుల బ్యాగులకు రిఫ్లెక్టర్ స్టిక్కర్లు అంటించారు. వీరు వెళ్తున్న రోడ్డు వెంబడి వెళ్లే వాహనాల లైట్ల వెలుతురు ఈ స్టిక్కర్లపై పడి మెరుస్తుందని, దీంతో, చీకటిగా ఉన్న ప్రాంతాల్లో వాహనచోదకులు ఈ స్టిక్కర్లను గుర్తించి జాగ్రత్తగా నడపాలని సూచిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నేనెవరికీ విందు భోజనాలు పెట్టలేదు

సేలం నార్త్ ఎమ్మెల్యే రాజేంద్రన్



చెన్నై, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మంత్రివర్గంలో తనకు స్థానం లభిస్తుందంటూ తానెవరికీ విందు భోజనం ఏర్పాటు చేయలేదని సేలం నార్త్ నియోజకవర్గ ఎమ్మెల్యే ఆర్.రాజేంద్రన్ స్పష్టం చేశారు. త్వరలో మంత్రివర్గంలో మార్పులు జరుగుబోతున్నాయని, ఈ సందర్భంగా మంత్రి పదవిని ఎదురుచూస్తున్న రాజేంద్రన్ పార్టీ ప్రముఖులకు భారీ స్థాయిలో విందు ఏర్పాటు చేశారంటూ ప్రసార మాధ్యమాల్లో వార్తలు వెలువడ్డాయి. ఈ వార్తలను సోమవారం ఉదయం ఆయన ఖండించారు. పార్టీలో తన అభివృద్ధిని చూసి ఓర్వలేనివారే ఇలాంటి వదంతులు వ్యాపింపజేశారన్నారు. తనకు మంత్రి పదవి కన్నా పార్టీ పదవే మిన్న అని పార్టీ అభివృద్ధి కోసం పాటుపడటమే తన లక్ష్యమని ఆయన చెప్పారు.

20 ఏళ్ల పోరాట ఫలితమే గ్యారెంటీ స్కీం

ఎస్ఆర్ఎంయూ ప్రధాన కార్యదర్శి కన్నయ్య



మీడియాతో మాట్లాడుతున్న కన్నయ్య తదితరులు

ప్యారీస్, ఆగస్టు 26: రైల్వే ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం 20 ఏళ్ల సుదీర్ఘ పోరాటానికి ఫలితం వచ్చిందని సదరన్ రైల్వే మజ్దూర్ యూనియన్ (ఎస్ఆర్ఎంయూ), ఆలిండియా రైల్వే ఫెడరేషన్ (ఏఐఆర్ఎఫ్) ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్.కన్నయ్య పేర్కొన్నారు. సెంట్రల్ రైల్వేస్టేషన్ సమీపంలోని ఎస్ఆర్ఎంయూ ప్రధాన కార్యాలయంలో సోమవారం జరిగిన మీడియా సమావేశంలో ప్రసంగించారు. ఈనెల 24న సాయంత్రం న్యూఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, క్యాబినెట్ కార్యదర్శి టీవీ సోమనాథన్‌తో సమావేశమై తీసుకున్న నిర్ణయాలను వెల్లడించారు. 2025 ఏప్రిల్ 1వ తేది నుంచి ఎన్పీఎస్‌కు బదులుగా గ్యారెంటీ పెన్షన్ పథకం అమలుపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం ముందుకొచ్చిందన్నారు. అలాగే, జీపీఎస్ పరిధిలో ఉన్న ఉద్యోగి మరణిస్తే కుటుంబ సభ్యులు జీపీఎస్ పింఛన్ 60 శాతం పింఛన్‌గా పొందుతారని తెలిపారు. స్థానిక భాషలు అర్థం కాక ఇబ్బందులు ఎదుర్కొంటున్న హిందీ మాతృభాష కలిగిన ఇతర రాష్ట్రాలకు చెందిన రైల్వే ఉద్యోగులను వెంటనే వారి సొంత రాష్ట్రాలకు బదిలీ చేసేందుకు కూడా కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చిందని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఆర్ఎంయూ అధ్యక్షుడు సీఏ రాజాశ్రీధర్, ఉప ప్రధాన కార్యదర్శి ఈశ్వర్‌లాల్, పాల్‌మాక్స్‌వెల్ జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

దళితుడు ప్రధాని అయ్యే రోజులు రావాలి!

డీపీఐ నేత తిరుమావళవన్

చెన్నై, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): దేశంలో దళితుడు ప్రధాని పదవిని చేపట్టే మంచి రోజులు రావాలని డీపీఐ నేత తొల్ తిరుమావళవన్ అన్నారు. ఈరోడ్‌లో జరిగిన ఓ సభలో ఆయన ప్రసంగిస్తూ రాష్ట్రంలో ఓబీసీలకు చెందిన బలహీనవర్గాల వ్యక్తులు ముఖ్యమంత్రి పదవిని చేపడుతున్నారని, దళితుడు ముఖ్యమంత్రి అయ్యే అవకాశాలు కనిపించడం లేదన్నారు. అదే సమయంలో దేశ ప్రధానిగా ఓ దళితుడు పదవిని చేపట్టే మంచి రోజులు రావాలని ఆకాంక్షిస్తున్నానని చెప్పారు. పెరియార్ సిద్ధాంతాను గౌరవించే రాష్ట్ర ప్రజలు దళితుడిని ప్రధానిగా చేసేందుకు ఇప్పటి నుంచే చర్యలు ప్రారంభించాలని పిలుపునిచ్చారు.

దుప్పి మాంసం తరలిస్తున్న ఫారెస్ట్ గార్డ్ అరెస్ట్

పెరంబూర్, ఆగస్టు 26: దుప్పి మాంసం తరలిస్తున్న వేట నిరోధక విభాగం గార్డ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. సత్యమంగళం సమీపంలోని మేట్టుపాళయం వెళ్లే రోడ్డులో ఆదివారం రాత్రి పోలీసులు గస్తీ పనులు చేపట్టారు. ఆ సమయంలో అటుగా బైక్‌పై వచ్చిన ఫారెస్ట్ గార్డ్ బొమ్మన్ బ్యాగు తనిఖీ చేయగా, అందులో దుప్పి మాంసం లభించింది. దీంతో బొమ్మన్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు విచారిస్తున్నారు.

చావింట చితకబాదిన బంధువులపై అలిగి...

సెల్‌టవర్ ఎక్కి యువకుడి ఆత్మహత్యాయత్నం

చెన్నై, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): తిరువేర్కాడులో మద్యం మత్తులో ఓ చావింటికి వెళ్లిన తనను బంధువులు చితకబాదారానే అవమానంతో ఓ యువకుడు సెల్‌టవర్ ఎక్కాడు. అంబత్తూరు సమీపం అయ్యపాక్కానికి చెందిన విల్సన్ డ్రైవర్. తిరువేర్కాడు సమీపం పెరుమాళగరం వద్ద ఓ బంధువు మృతి చెందటంతో భార్యతోపాటు అంత్యక్రియలలో పాల్గొనేందుకు సోమవారం ఉదయం వెళ్ళాడు. ఆ సందర్భంగా విల్సన్ మద్యం మత్తులో బంధువులతో గొడవపెట్టుకున్నాడు. ఆగ్రహించిన బంధువులు విల్సన్‌ను చితకబాదారు. ఈ అవమానాన్ని భరించలేక అతడు ఆ ప్రాంతంలోని 100 అడుగుల సెల్‌టవర్ ఎక్కి ఆత్మహత్య చేసుకుంటానని బిగ్గరగా కేకలు పెట్టాడు. ఈ విషయం తెలుసుకున్న బంధువులు అక్కడికి పరుగెత్తుకెళ్ళి క్షమాపణలు చెప్పి కిందకు దిగి రమ్మంటూ వేడుకున్నారు. అయినా విల్సన్ కిందకు దిగలేదు. అప్పటికే ఆ ప్రాంతం వద్ద జనం పెద్ద సంఖ్యలో గుమికూడారు. ఈ సమాచారం అందుకున్న తిరువేర్కాడు పోలీసులు, ఆవడి అగ్నిమాపక దళం సభ్యులు హుటాహుటిన అక్కడికి చేరుకుని అతడితో చర్చలు జరిపినప్పటికీ అతడు పట్టువీడలేదు. చివరకు విల్సన్‌పై తొలుత చేయి చేసుకున్న బంధువును అక్కడికి తీసుకెళ్ళి అతడితో చర్చలు జరిపించారు. ఆ తర్వాత శాంతించిన విల్సన్ కిందకు దిగాడు. పోలీసులు అతడిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

కావేరి ప్రక్షాళన కోసం...

శ్రీరంగం వాగులో దిగిన ఎమ్మెల్యే



వాగునీటిలో దిగి పరిశీలన జరుపుతున్న ఎమ్మెల్యే పళనియాండి

చెన్నై, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి):తిరుచ్చి జిల్లా శ్రీరంగం వద్ద కావేరి వాగులో శుభ్రతపనుల సందర్భంగా ఆ నియోజకవర్గ శాసనసభ్యుడు పళనియాండి ఓ వాగులో దిగి పరిశీలన జరిపారు. తిరుచ్చివద్ద కావేరి నది ముక్కొంబు ప్రాంతంలో కొల్లిడం, కావేరి అంటూ రెండుగా ప్రవహిస్తుంది. కావేరి నది పుదువాత్తలై, రామావాత్తలై అనే రెండు కాలువల గుండా ప్రవహించి శ్రీరంగం ప్రాంతంలోని సుమారు 20 గ్రామాలోని 15 వేల ఎకరాల భూములకు సాగు జలాలు అందిస్తోంది. ఆ రెండు కాలువలలో ప్రస్తుతం చెత్తాచెదారం పేరుకోవడంతో భూములకు సక్రమంగా నీరందటం లేదని స్థానిక రైతులు ఎమ్మెల్యేకి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం ఆయన అధికారులను, ఇంజనీరింగ్ నిపుణులను వెంటబెట్టుకుని ఎక్స్‌కవేటర్లతో కాలువల్లో ఉన్న పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం తొలగించారు. ఆ సందర్భంగా శ్రీరంగం వద్దనున్న పుదువాత్తలై వాగులోకి ఉన్నట్టుండి పళనియాండి దిగి నీటిలో చెత్తాచెదారం పేరుకుపోయి ఉందా అని పరిశీలన జరిపారు. వాగునీటిలో ఆయన భుజాల దాకా నీట మునిగి చేతులతో చెత్తాచెదారాన్ని వెలికితీసి చెత్తాచెదారం ఉందని, తొలగించమని అధికారులను పురమాయించారు. ఇలా ఎమ్మెల్యే పళనియాండి వాగునీటిలో దిగడం చూసి స్థానిక ప్రజలు విస్తుపోయారు.

ముగిసిన రాజస్థానీ ఒలంపియాడ్



కార్యక్రమంలో మంగై రామ్ శర్మ, మేఘునాథ రెడ్డి తదితరులు

చెన్నై, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): 'రాజస్థానీ అసోసియేషన్ తమిళనాడు' ఆధ్వర్యంలో రాజస్థానీ ఒలంపియాడ్ ఆదివారం ముగిసింది. స్థానిక పెరియమేట్‌లోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన ఒలంపియాడ్ గ్రాండ్ ఫినాలేలో రాష్ట్ర ప్రజాపనుల శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి మంగై రామ్ శర్మ, క్రీడాభివృద్ధి విభాగ మెంబర్ సెక్రటరీ జె.మేఘనాథ రెడ్డి, ఓపీబీ గ్రూప్ వెంచర్స్ సీఈవో అరవింద్‌గుప్తా, ఆర్ఆర్ గోపాల్‌జీ, అన్వేషరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో సుమారు 40 పాఠశాలలకు చెందిన 1200 మంది పాల్గొనగా, 32 రాజస్థానీ సంస్థలు ముగింపోత్సవంలో పాల్గొన్నాయి. విజేతలందరికీ నిర్వాహకులు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రాజస్థానీ అసోసియేషన్ తమిళనాడు అధ్యక్షుడు ప్రవీణ్ దాటియా మాట్లాడుతూ.. రాజస్థానీ సమాజం ఎప్పుడూ తమిళనాడును తన కార్యక్షేత్రంగా పరిగణిస్తుందని పేర్కొన్నారు.

పాత పింఛన్ విధానం అమలుచేయండి

ఓపీఎస్ డిమాండ్

పెరంబూర్, ఆగస్టు 26: డీఎంకే ఎన్నికల మేనిఫెస్టోలో 309వ హామీగా ప్రకటించిన పాత పింఛన్ విధానం సత్వరం అమలు చేయాలని మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం డిమాండ్ చేశారు. కొత్త పింఛన్ విధానం రద్దు చేసి పాత పింఛన్ అమలు చేస్తామని హామీ ఇచ్చిన డీఎంకే, అధికారం చేపట్టి మూడేళ్లు దాటినా పాత పింఛన్ విధానంపై ఎలాంటి ప్రకటన చేయలేదన్నారు. అదే సమయంలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 2025 ఏప్రిల్ 1వ తేది నుంచి కొత్త పింఛన్ విధానం అమలుచేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఇప్పటికైనా డీఎంకే ప్రభుత్వం స్పందించి, పాత పింఛన్ విధానం అమలు చేసేలా చర్యలు చేపట్టాలని ఓపీఎస్ డిమాండ్ చేశారు.

చెన్నై విమానాశ్రయంలో స్మగ్లింగ్ నివారణ చర్యలు

పోలీసు జాగిలంతో ప్రత్యేక స్క్వాడ్

ప్యారీస్, ఆగస్టు 26: చెన్నై విమానాశ్రయంలో రోజురోజుకు పెరుగుతున్న బంగారం, మాదకద్రవ్యాల స్మగ్లింగ్ అడ్డుకునేందుకు 'ఎయిర్ ఇంటెలిజెన్స్ యూనిట్ (ఏఐయూ)' ప్రత్యేక పోలీసు జాగిలం స్క్వాడ్ నియమించారు. అంతర్జాతీయ విమానాశ్రయంలో ప్రస్తుతం కస్టమ్స్ శాఖ ఆధ్వర్యంలో ఏఐయూ విభాగానికి మరింత బలం చేకూర్చారు. ఇందులో అదనంగా సంయుక్త అసిస్టెంట్ కమిషనర్లను నియమించారు. వీరు మఫ్టీలో ప్రయాణికులలాగే బంగారం, మాదకద్రవ్యాల అక్రమ తరలింపుకు పాల్పడుతున్న వారి కదలికలు పర్యవేక్షిస్తారు. రన్‌వేపై ఆగిన విమానాల నుంచి దిగుతున్న ప్రయాణికులు, వారి లగేజీల తనిఖీ, అనుమానించదగ్గ విధంగా వ్యవహరించే ప్రయాణికులను అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు. అంతేకాకుండా, తాజాగా నియమితులైన ఆరుగురు అధికారులు పోలీసు జాగిలాల సాయంతో ప్రయాణికుల లగేజీతో పాటు కార్గోలో భద్రపరచిన లగేజీని కూడా తనిఖీ చేస్తున్నారు.

వెల్లివిరిసిన మతసామరస్యం

ఆలయ వేడుకలకు సారె అందజేసిన ఇస్లామీయులు



ఆలయ నిర్వాహకులకు సారె అందజేస్తున్న ఇస్లామీయులు

పెరంబూర్, ఆగస్టు 26: కృష్ణగిరి జిల్లా వడమేలంపట్టి ఆలయ వేడుకలు మతసామరస్యానికి ప్రతీకగా నిలిచాయి. ఈ గ్రామంలోని కందమారియమ్మన్ ఆలయ జీర్ణోద్ధరణ పనులు ముగియడంతో కుంభాభిషేకం నిర్వహించేందుకు గ్రామస్తులు నిర్ణయించారు. వేడుకల కోసం వ్రతమాచరిస్తున్న భక్తులు 15 రోజులుగా ఆలయంలో పూజలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, ఈ గ్రామంలో సుమారు 300కు పైగా ఇస్లామీయుల కుటుంబాలున్నాయి. వీరు ఆదివారం మేళతాళాలు, బాణసంచా నడుమ ఊరేగింపుగా సారెతో ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ నిర్వాహకుల పర్యవేక్షణలో పూజారులకు సారె అందజేశారు. అనంతరం ఇస్లామీయుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం జరిగింది.

'నిన్ను భార్యగా పొందడం నా భాగ్యం'

అభినందించి పూలు అందించిన భర్తలు



కార్యక్రమంలో పాల్గొన్న దంపతులు

పెరంబూర్, ఆగస్టు 26: 'సుకుమారమైన పువ్వులాంటి మనసున్న నిన్ను భార్యగా పొందినందుకు నేను ధన్యుడిని. నిన్ను జీవితాంతం ఆదుకుంటాను. రక్షిస్తాను' అంటూ పురుషులు తమ భార్యలకు పువ్వులు అందజేసి కొనియాడారు. కాంచీపురంలో ఆదివారం జరిగిన 'వైఫ్ వెల్ఫేర్ నామినేషన్ డే'ని కాంచీపురం ఉపాధ్యక్షుడు కన్నప్పన్ నేతృత్వంలో వెట్రిసెల్వి, సంఘ శ్రేయోభిలాషులు సంపత్, మేల్‌మరువత్తూర్ లక్ష్మి బంగారు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశన్ సహా 120మంది దంపతులు పాల్గొన్నారు.

జంతువులను ఇబ్బంది పెట్టొద్దు

బోనులో కూర్చుని వినూత్న నిరసన



పెరంబూర్, ఆగస్టు 26: కోవై నగరం రేస్ కోర్స్ సమీపంలో జంతువుల హక్కుల పరిరక్షణ కార్యకర్తలు వినూత్న నిరసన చేపట్టారు. జంతువులను బోన్లలో బంధించడం, హింసించడం తదితరాలు విడనాలన్నారు. బ్రాయిలర్ కోళ్ల పెంపకానికి మందులు వినియోగిస్తున్నారని, ఆ కోళ్ల మాంసం తిన్న ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. జంతువులకు స్వేచ్ఛ కల్పించడంతో పాటు వాటి పరిరక్షణ చేపట్టాలని కోరుతూ ఈ నిరసన ప్రదర్శన చేపట్టినట్లు వారు పేర్కొన్నారు.

ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసు నిందితుడికి అస్వస్థత

చెన్నై, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆమ్‌స్ట్రాంగ్ హత్య కేసులో ప్రధాన నిందితుడు తిరుమలై ఉన్నట్టుండి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. పూందమల్లి జైలులో ఉన్న అతడిని పోలీసులు స్టాన్లీ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, వైద్య చికిత్సలందిస్తున్నారు. తిరుమలై చికిత్స పొందుతున్న వార్డు చుట్టూ గట్టి పోలీసు భద్రత కల్పించారు.

అరివాలయంలో బీర్ బాటిల్ విసిరిన అన్నాడీఎంకే నేత అరెస్టు

చెన్నై, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక తేనాంపేటలోని డీఎంకే ప్రధాన కార్యాలయం ప్రాంగణంలోకి సోమవారం వేకువజాము 5గంటల ప్రాంతంలో బీరు సీసాను విసిరేసి పారిపోయేందుకు ప్రయత్నించిన దురైపాక్కంకు చెందిన అన్నాడీఎంకే నాయకుడు గోవర్ధన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. తేనాంపేట పోలీసులు ఆయన్ను విచారించారు. మద్యం తాగటం వల్ల రోజూ తన ఇంట్లో గొడవలు జరుగుతున్నాయని, డీఎంకే చెందినవారే మద్యాన్ని విక్రయిస్తుండటంతో వారిపై ఆగ్రహం చెందిన తాను బీర్‌బాటిల్‌ని విసిరేశానని గోవర్ధన్ పోలీసులకు వాంగ్మూలం ఇచ్చారు.

నీటమునిగి ఇద్దరు బాలుర మృతి

పెరంబూర్, ఆగస్టు 26: బావిలో ఈతకు వెళ్లిన ఇద్దరు బాలురు నీట మునిగి మృతిచెందారు. తూత్తుకుడి జిల్లా కోవిల్‌పట్టి సమీపం కూసాలిపట్టికి చెందిన 10 మంది బాలురు సమీపంలో వ్యవసాయ బావిలో ఈతకు వెళ్లారు. అందరూ ఈత కొడుతుండగా వారిలో ఆకాష్ (14), సామువేలు (14) లోతైన ప్రాంతానికి వెళ్లి మునిగారు. సహచర బాలురు పెట్టిన కేకలతో అక్కడకు చేరుకున్న చుట్టుపక్కల వారు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు అక్కడకు చేరుకొని బావిలో గాలించి మృతదేహాలు వెలికితీశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

భూతగాదాలో మహిళ అరెస్ట్

ప్యారీస్, ఆగస్టు 26: తిరువళ్లూర్ జిల్లా తిరుత్తణి సమీపంలో ఎకరా వ్యవసాయ భూమి పంపకం వ్యవహారంలో అత్తను చంపేందుకు యత్నించిన కోడలిని పోలీసులు అరెస్ట్ చేశారు. తిరుత్తణి సమీపంలో పూనిమాంగాడుకు చెందిన జగదాంబాళ్ భర్త 30 ఏళ్ల క్రితం మరణించారు. ఆమె తన కుమారుడు మునివేలు, కుమార్తె నదియాతో నివసిస్తున్నారు. పదేళ్ల క్రితం కళ్లకుర్చికి చెందిన ఝాన్సీరాణితో మునివేల్ వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. ఈ నేపథ్యంలో, జగదాంబాళ్ పేరుతో ఉన్న వ్యవసాయ భూమిని తన పేరుకు మార్చాలని ఏడాదిగా ఝాన్సీరాణి కోరుతోంది. దీనికి అత్త స్పందించకపోవడంతో అసహనానికి గురైన ఝాన్సీరాణి, అత్తను కిరాయి ముఠాతో హతమార్చేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీనిపై అందజేసిన ఫిర్యాదుతో ఝాన్సీరాణిని అరెస్ట్ చేసిన పోలీసులు, కోర్టు ఉత్తర్వుల మేరకు పుళల్ జైలుకు తరలించారు.

ఛార్జీలు చెల్లించని సరుకుల ఓడ జప్తు

మద్రాసు హైకోర్టు

ప్యారీస్, ఆగస్టు 26: కారైక్కాల్ హార్బర్‌లో సర్వీసు ఛార్జీ చెల్లించని సరుకుల ఓడను జప్తు చేయాల్సిందిగా మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఆదిత్య మెరైన్ సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌లో... రాష్ట్రంలోని ఓడరేవుల్లో సాంకేతికలోపం కారణంగా కదలని ఓడలను భారీ క్రేన్ల ద్వారా తొలగించే పనులు చేపడుతున్నామని, ఈక్రమంలో కారైక్కాల్ హార్బర్‌లో నిలిచిపోయిన డాల్ఫిన్ నెం-1 అనే ఓడను విశాఖపట్టణానికి తరలించినందుకు తమకు ఎలాంటి ఛార్జీలు చెల్లించలేదని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి సెంథిల్‌కుమార్ రామ్మూర్తి సోమవారం విచారణ జరిపి, సర్వీసు ఛార్జీ చెల్లించని సరుకుల ఓడను జప్తు చేయాల్సిందిగా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కేసులో డాల్ఫిన్ నెం-1 నౌకా సంస్థ సెప్టెంబరు 2న వివరణతో కూడిన నివేదిక సమర్పించాలని ఆదేశించారు.

బిల్మోరియాకు గండపెండేరంతో సత్కారం



రాపాక జాన్ బిల్మోరియాను గండపెండేరంతో సత్కరిస్తున్న తాటిపర్తి ఐజక్, మేజర్ సాల్మన్‌రాజు తదితరులు

ప్యారీస్, ఆగస్టు 26: అంతర్జాతీయ సువార్త గాయకుడు, సంగీత దర్శకుడు, సాహితీవేత్త డాక్టర్ రాపాక జాన్ బిల్మోరియాను చెన్నైలోని తురా ఫౌండేషన్ గండపెండేరం ధారణతో సత్కరించింది. పెరంబూర్‌లోని వాటర్‌బరీ మెమోరియల్ తెలుగు బాప్టిస్ట్ సంఘ ప్రాంగణంలో శనివారం రాత్రి తురా సువార్త సంగీతోత్సవం వీనులవిందుగా సాగింది. ఫౌండేషన్ డైరెక్టర్ రెవరెండ్ తాటిపర్తి ఐజక్, స్వర్ణలత దంపతుల అధ్యక్షతన సాగిన ఈ ఉత్సవంలో ప్రముఖ సంగీత దర్శకుడు ఎం.జాన్సన్ నేతృత్వంలో హైదరాబాద్‌కు చెందిన గాయకులు నిస్సీ జాన్, మెర్సీ ఏంజెల్, స్వరూప్, స్టాన్లీ జోన్స్, టోని ప్రకాష్‌తో కలసి బిల్మోరియా తమ పాటలతో శ్రోతలను పైమరపించారు. ఆత్మీయ అతిథులుగా రెవరెండ్ డాక్టర్ ఎస్.ప్రకాష్‌రాజ్, డాక్టర్ గొల్లపల్లి ఇశ్రాయేలు, మేజర్ సాల్మన్‌రాజ్, ఇన్‌కంటాక్స్ కమిషనర్ అనీల్‌కుమార్, రెవరెండ్ డాక్టర్ దయాపాత్రా సహా నగరంలోని పలు తెలుగు సంఘాల నిర్వాహకులు, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఐజక్ మాట్లాడుతూ... సంఘ సంస్కర్త స్వర్గీయ పరిశిపోగు సామ్యూల్ స్మృత్యర్థం తురా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సువార్త గాయకులను సత్కరించడం మహాభాగ్యమన్నారు. అలాగే, దివంగత ఘంటసాలలాగే పాటలు శ్రావ్యంగా ఆలపిస్తున్న జాన్ బిల్మోరియాను గండపెండేరం ధారణతో సత్కరించామని ఆయన తెలిపారు.

కోవైలో రూ.1.14 లక్షల గంజాయి చాక్లెట్లు స్వాధీనం

పెరంబూర్, ఆగస్టు 26: కోయంబత్తూర్ జిల్లా కోవిల్‌పాళయంలో రూ.1.14 లక్షల విలువైన గంజాయి చాక్లెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాహనాల గస్తీ పనుల్లో పాల్గొన్న పోలీసులు, ఆ సమయంలో అటుగా వచ్చిన సంజయ్‌కుమార్, కమల్‌ను అదుపులోకి తీసుకొని వారి నుంచి 34 కిలోల గంజాయి స్వాధీనం చేసుకొని వారిని విచారిస్తున్నారు.



డ్యాన్స్ స్కూల్‌ను ప్రారంభించిన ఇనియ

తమిళ చిత్రపరిశ్రమలోని యంగ్ హీరోయిన్లలో ఒకరిగా గుర్తింపు పొందిన కథానాయిక ఇనియ.. డ్యాన్స్ స్కూల్‌ను ప్రారంభించారు. దీనికి ఆత్రేయ డ్యాన్స్ స్టూడియోగా నామకరణం చేశారు. 'వాగై సూడవా' చిత్రం ద్వారా కోలీవుడ్‌కు పరిచయమైన ఇనియ... ఆ తర్వాత పలు చిత్రాల్లో నటించారు. గత కొన్ని రోజులుగా సరైన అవకాశాలు లేకపోవడంతో ఆమె కొత్త మార్గాన్ని ఎంచుకున్నారు. సాటి కళాకారుడు గురు అరుణ్ నందకుమార్‌తో కలిసి ఈ డ్యాన్స్ స్కూల్‌ను ప్రారంభించారు. ఈ స్కూల్‌కు చెందిన విద్యార్థులు... దుబాయ్‌లో జరిగిన ఒక ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో కూడా నృత్య ప్రదర్శన చేసి శెభాష్ అనిపించుకున్నారు. కాగా, ఇందులో ఇనియా షో డైరెక్టర్ పాత్రను పోషించారు.

స్నేహితుడి కోసం నిర్మించిన చిత్రం

'సేవకర్'

● ప్రిజన్ హీరోగా పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్


'సేవకర్'లో ప్రిజన్, షకానా

సిల్వర్ మూవీస్ ఇంటర్నేషనల్ పతాకంపై నిర్మాత రాజన్ జోసెఫ్ థామస్ తన స్నేహితుడు సంతోష్ గోపినాథ్ కోసం నిర్మించిన చిత్రం 'సేవకర్'. ఎప్పటికైనా సినిమాను నిర్మించి, ఆ పోస్టరుపై తన పేరు ఉండాలన్న కలను సాకారం కూడా చేసుకున్నారు. ప్రిజన్ - షకానా జంటగా నటించిన ఈ చిత్రంలో బోస్ వెంకట్, ఆడుకలం నరేన్, మదురై శరవణన్, ఉడుమలై రాజేష్, హీమా శంకరి, రూపా, సునీల్, బాలు, షాజి కృష్ణ, సాయి శంకర్ తదితరులు ఇతర పాత్రలను పోషించారు. సంతోష్ గోపినాథ్ కథను సమకూర్చి దర్శకత్వం వహించారు. ఆర్‌డీ మోహన్ సంగీతం అందించగా, ప్రదీప్ నాయర్ ఛాయాగ్రహణం సమకూర్చారు. ఈ సినిమా గురించి దర్శక నిర్మాతలు మాట్లాడుతూ... 'దేశంలో ఎక్కడ అన్యాయం జరిగినా ధైర్యంగా నిలబడే వ్యక్తి హీరో. అతనికి అండగా నిలబడే నలుగురు స్నేహితులు. అన్యాయంతో పాటు అకృత్యాలకు పాల్పడుతున్న రాజకీయ నేత పాత్రలో ఆడుకలం నరేన్ నటించారు. స్వతహాగా అన్యాయాలను ఎదిరించే గుణం కలిగిన ప్రిజన్... తన న్యాయపరమైన చర్యలను అడ్డుకునేందుకు ప్రయత్నించే దుష్టశక్తులను నాశనం చేయాలని భావిస్తాడు. దీంతో ఆయనకు అనేక సమస్యలు ఎదురవుతాయి. అరెస్టు చేసి జైలుకు తరలిస్తారు. అలాంటి సమయంలో పోలీస్ అధికారిగా ఉన్న బోస్ వెంకట్ నుంచి అమూల్యమైన సూచనలు సలహాలు పొందుతాడు. ఆ తర్వాత కథ ఎలాంటి మలుపులు తిరుగుతుందో వెండితెరపై చూడాల్సిందే' అని వారు వివరించారు. తమిళం, మలయాళం భాషల్లో ఏకకాలంలో చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ చిత్రం.. టీజర్, ఫస్ట్‌లుక్‌ను త్వరలోనే విడుదల చేయనున్నారు.

చిత్రజ్యోతి

పుగళ్ హీరోగా 'ఫోర్ సిగ్నల్'



విజయ్ టీవీ ఫేం, హాస్య నటుడు పుగళ్ హీరోగా తెరకెక్కిన చిత్రం 'ఫోర్ సిగ్నల్'. శ్రీ లక్ష్మీషణ్ముగనాథన్, కేశవ్ ప్రొడక్షన్స్ సమర్పణలో ఆర్.మణికంఠన్, మహేశ్వరన్ కేశవన్ నిర్మాణంలో మహేశ్వరన్ కేశవన్ దర్శకత్వం వహించారు. లవ్, సెంటిమెంట్‌తో రూపుదిద్దుకున్న ఈ సినిమాను దీపావళి పండుగ సీజన్‌లో రిలీజ్ చేసేందుకు ప్లాన్ చేశారు. నగరాలు, పట్టణాల్లో నివసించే ప్రతి ఒక్కరూ ఉపయోగించే సాధారణ రవాణా వాహనమైన షేర్ ఆటో చుట్టూ ఈ స్టోరీ తిరుగుతుంది. చెన్నైలో వివిధ పనుల నిమిత్తం తమ ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్లే ప్రయాణికులు, షేర్ ఆటో డ్రైవర్ మధ్య జరిగే ఆసక్తిక అంశాలే ఈ చిత్ర కథాంశం. ఇతర పాత్రల్లో అరువి తిరునావుక్కరసు, కల్లూరి వినోద్, లొల్లు సభ శేషు, షర్మిల, విజయ్ ఆదిరాజ్ తదితరులు నటించారు. బాల పళనియప్పన్ సినిమాటోగ్రఫీ అందించగా, సంగీతం ఏజే అలిమిర్జాక్. సామాన్యుల జీవితంలో నిత్యం జరిగే సంఘటనల ఆసక్తికరమైన సమాహారంగా తెరకెక్కించామని, నాణ్యమైన కథా చిత్రాలను ఎల్లవేళలా ఆదరించే తమిళ ప్రేక్షకులు తమ చిత్రాన్ని కూడా ఆదరిస్తారన్న నమ్మకం ఉందని దర్శకుడు చెప్పారు.

ధనుష్ దర్శకత్వంలో ప్రియాంకా మోహన్ నృత్యం


'నిలవుక్కు ఎన్ మేల్ ఎన్నడి కోపం'లో ప్రియాంక మోహన్

స్టార్ హీరో ధనుష్ 'రాయన్' వంటి హిట్ చిత్రం తర్వాత 'నిలవుక్కు ఎన్ మేల్ ఎన్నడి కోపం' అనే పేరుతో మరో చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఇందులో హీరోగా తన అక్క కుమారుడు బవిష్‌ను వెండితెరకు హీరోగా పరిచయం చేస్తున్నారు. ఇందులో అనైనాక సురేంద్రన్, మాథ్యూ థామస్, ప్రియా ప్రకాష్ వారియర్, శరత్ కుమార్ వంటి ముఖ్య తారాగణం నటిస్తున్నారు. జీవీ ప్రకాష్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని వండర్‌బార్ ఫిలిమ్స్, ఆర్‌కే ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇటీవల ఈ సినిమా నుంచి 'గోల్డెన్ స్పారో' అంటూ సాగే తొలి సింగిల్‌ను రిలీజ్ చేశారు. ఇందులో హీరోయిన్ ప్రియాంకా మోహన్ కేమియో రోల్ పోషించారు. ధనుష్ - ప్రియాంక కలిసి 'కెప్టెన్' మూవీలో నటించిన విషయం తెల్సిందే. ఆ కారణంగానే ఈ చిత్రంలో ప్రియాంక కేమియో రోల్ చేసేందుకు అంగీకరించారనే టాక్ వినిపిస్తోంది. ఈ చిత్రానికి నిర్మాతలు కస్తూరిరాజా, విజయలక్ష్మి కస్తూరిరాజా.



పురస్కారగ్రహీతలకు సత్కార దృశ్యం - ఆవిర్భవ్‌కు సన్మానం

తెలుగు సంస్కృతిని పరిరక్షించుకోవాలి

● ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్
● ఘనంగా శ్రీ కళాసుధ కృష్ణాష్టమి - రజతోత్సవాలు


కార్యక్రమానికి హాజరైన తెలుగువారు

అడయార్, ఆగస్టు 26: నానాటికీ అంతరించిపోతున్న తెలుగు సంస్కృతిని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అవనిగడ్డ నియోజకవర్గ జనసేన ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పిలుపునిచ్చారు. చెన్నైలోని ప్రముఖ తెలుగు సంస్థ శ్రీ కళాసుధ తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలతో పాటు ఆ సంస్థ రజతోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని స్థానిక ఆళ్వార్‌పేటలోని మ్యూజిక్ అకాడమీలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ప్రత్యేక అతిథులుగా ఏఐటీఎఫ్ అధ్యక్షుడు, ప్రొఫెసర్ డాక్టర్ సీఎంకే రెడ్డి, రిటైర్డ్ డీజీపీ ఆర్.శేఖర్, ప్రముఖ సినీ నిర్మాత ఏ.ఎం.రత్నం, ఆస్కా అధ్యక్షుడు డాక్టర్ కె.సుబ్బారెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఎస్‌ఆర్‌ఎం గ్రూపు ఛైర్మన్ డాక్టర్ రవి పచ్చముత్తు, ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్‌లకు 'సేవా రత్న', టీఎస్ సంగీత్ నాటక అకాడమీ ఛైర్‌పర్సన్ డాక్టర్ అలేఖ్య పుంజాలకు 'నాట్య కళాసుధ - యామిని కృష్ణమూర్తి', ప్రముఖ వీణా వాయిద్య కళాకారిణి వీణా శ్రీవాణికి 'సంగీత సుధ సరస్వతి' పురస్కారాలతో పాటు 'సూపర్ స్టార్ సింగర్ 3' విజేత మాస్టర్ ఆవిర్భవ్‌కు 'బాల గానగంధర్వ' అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ.. చెన్నై నగరంలో తెలుగు భాష, తెలుగు సంస్కృతి పరిరక్షణకు పాటుపడుతున్న సంస్థల్లో శ్రీ కళాసుధ ఒకటన్నారు. ఎప్పుడైతే భాష నశించిపోతుందో జాతి కూడా నశించిపోతుందనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. ఇతర భాషలకు మనం వ్యతిరేకం కాదని, మాతృభాషను పరిరక్షించుకోవాలని సూచించారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అధికారంలో ఉన్న టీడీపీ - జనసేన - బీజేపీ కూటమి ప్రభుత్వం తెలుగు భాష పరిరక్షణకు చర్యలు చేపట్టాలని ఈ సభాముఖంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు విజ్ఞప్తి చేస్తున్నట్టు తెలిపారు. మాగుంట శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ.. శ్రీ కళాసుధ దశమ వార్షికోత్సవం, 25వ వార్షికోత్సవ ముగింపు వేడుకల్లో తాను అతిథిగా పాల్గొనడం యాదృచ్ఛికమన్నారు. ఒక సంస్థను 25 యేళ్లు నడపడమంటే అషామాషీ విషయంకాదన్నారు. ఇందుకోసం ఈ సంస్థ వ్యవస్థాపకుడు బేతిరెడ్డి శ్రీనివాస్‌ను అభినందిస్తున్నట్టు తెలిపారు. ఎస్‌ఆర్‌ఎం గ్రూపు ఛైర్మన్ రవి పచ్చముత్తు మాట్లాడుతూ.. 'ఒక సంస్థను 25 సంవత్సరాలుగా దిగ్విజయంగా నడుపుతున్న నిర్వాహకులకు ప్రత్యేకంగా అభినందిస్తున్నానని, ఇక ముందు కూడా విజయవంతంగా కొనసాగించాలని కోరుతున్నట్టు చెప్పారు. ప్రస్తుత యాంత్రిక జీవితంలో ఇలాంటి పవిత్రమైన రోజుల్లో ఇంత మంచి కార్యక్రమాలను నిర్వహిస్తూ, కుటుంబసభ్యులందరూ కలిసి వీక్షించే అవకాశాన్ని కల్పిస్తున్న శ్రీకళా సుధను సంస్థను అభినందిస్తున్నట్టు తెలిపారు. వీణా శ్రీవాణి మాట్లాడుతూ.. 'వీణా వాయిద్యాన్ని భావితరాల వారికి తీసుకెళ్ళడం కోసం తన వంతు ప్రయత్నం చేస్తున్నట్టు తెలిపారు. ఆస్కా అధ్యక్షుడు డాక్టర్ కె.సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. తమిళనాడులో రజతోత్సవాలు జరుపుకున్న శ్రీకళాసుధ అసోసియేషన్ నిర్వాహకులను అభినందిస్తున్నట్టు తెలిపారు. బేతిరెడ్డి శ్రీనివాస్ ఏ కార్యక్రమం నిర్వహించినా అందులో ప్రత్యేకత ఉంటుందన్నారు. అలాగే, పద్మా దేవదాస్, డాక్టర్ సీఎంకే రెడ్డి, అలేఖ్య పుంజాల, ఆర్.శేఖర్ కూడా ప్రసంగించారు. అంతకుముందు వీజీఎన్ హోమ్స్ డైరెక్టర్ పద్మ దేవదాస్ చేతుల మీదుగా జ్యోతిప్రజ్వలన జరిగింది. హైదరాబాద్ నగరానికి చెందిన పి.మోహన కుమార్ గాంధీ వ్యాఖ్యాతగా వ్యవహరించిన ఈ వేడుకలు ఘంటసాల సావిత్రి కుమార్ ప్రార్థనా గీతంతో ప్రారంభమయ్యాయి. ఆ తర్వాత 'పద్మ భూషణ్' డాక్టర్ వెంపటి చిన్నసత్యం - కూచిపూడి ఆర్ట్ అకాడమీ బృందం నృత్యం, వీణ శ్రీవాణి వీణా వాయిద్యం, మాస్టర్ ఆవిర్భవ్ సినీ పాటలను ఆలపించి, ఆహూతులను అలరించారు. ఈ కార్యక్రమానికి కళాసుధ సంస్థ అధ్యక్షుడు బేతిరెడ్డి శ్రీనివాస్ అధ్యక్షత వహించగా, ఆ సంస్థ నిర్వాహకులు, కమిటీ సభ్యులు, నగరవాసులు పాల్గొన్నారు.

అమ్మవారి విగ్రహం, ఖడ్గం స్వాధీనం

ఐసిఎఫ్, ఆగస్టు 26: తిరువణ్ణామలై జిల్లాలో గుంతలు తవ్వినప్పుడు బయల్పడిన అమ్మవారి విగ్రహం, ఖడ్గాన్ని రెవెన్యూ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సెయ్యారు సమీపంలోని మాతూర్ గ్రామంలో శ్మశానానికి ప్రహరీ నిర్మించేందుకు గుంతలు తవ్వే పనులు జరిగాయి. మట్టి తీస్తుండగా 2 అడుగుల ఎత్తున్న అమ్మవారి రాతి విగ్రహం, 2 అడుగుల పొడవైన ఇత్తడి ఖడ్గం బయల్పడ్డాయి. కార్మికులు ఈ విషయాన్ని రెవెన్యూ శాఖ అధికారులకు తెలియజేశారు. అక్కడకు చేరుకున్న అధికారులు విగ్రహం, ఖడ్గాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయమై వారు మాట్లాడుతూ... శ్మశానాన్ని ఆనుకొని 50 ఏళ్ల క్రితం మారియమ్మన్ ఆలయం ఉండేదని, పర్యవేక్షణ లేక శిథిలమైన ఈ ఆలయం ప్రస్తుతం కనుమరుగైందని, ఆలయంలో ఉన్న అమ్మవారి విగ్రహం, ఖడ్గం ప్రస్తుతం భూమిలో పూడుకుపోయి లభించాయని తెలిపారు. పురావస్తు పరిశోధన అనంతరం విగ్రహం, ఖడ్గం గ్రామస్తులకు అప్పగిస్తామని పేర్కొన్నారు.


స్వాధీనం చేసుకున్న విగ్రహం, ఖడ్గం


కొండరైలు వద్ద పర్యాటకులు


బోట్ సవారీ చేస్తున్న పర్యాటకులు

ఊటీకి పోటెత్తిన పర్యాటకులు

కిటకిటలాడుతున్న పార్కులు


మంచులోనే జాగింగ్ చేస్తున్న పర్యాటకులు

చెన్నై, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వరుసగా మూడు రోజులు సెలవు దినాలు రావడంతో ప్రఖ్యాత పర్యాటక ప్రాంతమైన ఊటీలో పర్యాటకుల రాక విపరీతంగా పెరిగింది. కృష్ణాష్టమి సెలవుదినమైన సోమవారం ఉదయం నుంచే దేశ, విదేశాల నుండి వచ్చిన పర్యాటకులతో ఊటీలోని సందర్శనీయ ప్రాంతాలు జనంతో కిటకిటలాడాయి. పర్వతాల సామ్రాజ్ఞిగా పిలిచే నీలగిరి జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను సందర్శించేందుకు కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ తదితర పొరుగు రాష్ట్రాల నుంచి రోజూ వేల సంఖ్యలో పర్యాటకులు తరలివస్తున్నారు. ప్రస్తుతం వారంతపు సెలవుదినాలకు కృష్ణజయంతి సెలవుకూడా తోడవటంతో మూడురోజుల సెలవుదినాలను ఊటీని సందర్శించేందుకు కేటాయించుకుని పర్యాటకులు పోటెత్తుతున్నారు. సోమవారం ఉదయం నుండే ఊటీ బొటానికల్ పార్కు, రోస్ గార్డెన్, సిమ్స్ పార్కు, బోట్‌హౌస్, బైక్రా బోట్ హౌస్ తదితర ప్రాంతాలు కిటకిటలాడాయి. ప్రస్తుతం ఊటీ అంతటా చల్లటి వాతావరణం కొనసాగుతుండటంతో పర్యాటకులు వేకువజామునే వాకింగ్, జాగింగ్ చేస్తున్నారు. బొటానికల్ పార్కును, రోస్ గార్డెన్‌లో సందడి చేస్తున్నారు. అదే విధంగా ఊటీ కొండరైలులో ప్రయాణించేందుకు పర్యాటకులు పోటీపడ్డారు. ప్రస్తుతం ఊటీ నలుమూలల నీలగిరి చుట్టుపక్కలి జిల్లాలకు చెందినవారే కాకుండా పొరుగు రాష్ట్రాల నుండి వచ్చిన పర్యాటకులు కూడా పార్కులు, బోట్‌హౌస్ తదితర ప్రాంతాలను సందర్శిస్తున్నారు.

అయ్యప్ప భక్త సభ ఆధ్వర్యంలో శ్రీకృష్ణజయంతి వేడుకలు


చెన్నై ఈసీఆర్‌లో ఉన్న ఇస్కాన్ కేంద్రంలో జరిగిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో పాల్గొన్న రాష్ట్ర గవర్నర్ ఆర్‌ఎన్ రవి

చెన్నై, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక మహాలింగపురంలోని అయ్యప్పన్, గురువాయూరప్పన్ ఆలయాల వద్ద శ్రీ అయ్యప్ప భక్త సభ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం శ్రీకృష్ణ జయంతి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. వేకువజాము ఐదు గంటలకు మహా గణపతి హోమం, ఉదయం 6 నుంచి 8.30 గంటల వరకు పట్టాభిషేకం, నారాయణీయ పారాయణం జరిగాయి. అటు పిమ్మట నామసంకీర్తనలు, భజనలు, దీపారాధన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. చివరగా శ్రీకృష్ణుడు, రాధ, సత్యభామ వేషధారణతో చిన్నారులుచేసిన సందడి భక్తులను అలరింపజేశాయి.


శ్రీకృష్ణుడు, రాధ వేషధారణతో సందడి చేస్తున్న చిన్నారులు